# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people


## డెడ్ లైన్ జూలై 31

- రేషన్ కార్డు ఈ-కేవైసీకి ఆఖరు గడువు
- లక్ష్యం చేరుకోని డీలర్లపై కఠిన చర్యలు తప్పవు
- జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి ఆదేశం

4




శనివారం 18, జూలై 2026 | సంపుటి : 03 | సంచిక : 150 | పేజీలు : 05 | వెల ₹5




# రైతుల అరిగోస

వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

వర్షా భావ పరిస్థితుల్లో కొరవడిన ముందుచూపు

'దేవాదుల' పంపింగ్ లో దారుణ వైఫల్యం

సాగుకు కరెంటు సరఫరా రోజుకి కేవలం 13 గంటలే

రైతుల చేతికి మళ్లీ టార్చ్ లైట్లు.. కేసీఆర్ చెప్పిందే జరుగుతుంది

ప్రత్యామ్నాయ పంటల సాగుకూ ప్రోత్సాహం కరువు

ఫామ్ ఆయిల్ సాగులో డ్రిప్ ఇచ్చే కంపెనీలకు పేటెంట్స్ లేవు

యూరియా, డీఏపీ కొరత.. ఆధార్ కార్డుకో డీఏపీ బస్తా

ప్రణాళికలు.. సమీక్షలు లేవు .. వ్యవసాయ శాఖ ఫెయిల్

'అక్షరదర్బార్'తో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

ఎల్ నినో నేపధ్యంలో ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు

3

**అక్షరదర్బార్, హనుమకొండ**

వ్యవసాయరంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం కనబరుస్తుంది. ప్రస్తుతం వర్షా బావ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడంలో విఫలమైంది. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఖరీఫ్ సీజన్ కు ముందు నుంచే చెబుతున్నప్పటికీ ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని అందుబాటులోకి తేలేకపోయింది. వ్యవసాయానికి విద్యుత్తును కూడా 24 గంటలు ఇవ్వడం లేదు. రోజుకి కేవలం 13 గంటలు మాత్రమే ఇస్తుంది. అనధికార కోతలతో అది కూడా సరిగా సప్లై కావడం లేదు. ఇదిలా ఉంటే యూరియా, డీఏపీ కొరత రైతులను వెంటాడుతుంది. ఇక ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చెబుతుందే గాని ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ నేత, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ప్రభుత్వానికి ముందుచూపు కొరబడిందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానంగా వ్యవసాయ శాఖ వైఫల్యం స్పష్టంగా కనబడుతుందని మండిపడ్డారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షా భావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో శుక్రవారం వెంకటరమణారెడ్డి 'అక్షరదర్బార్'తో మాట్లాడారు. ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఏమన్నారంటే ఆయన మాటల్లో...




## కోట్ల విలువైన ప్రభుత్వ

# భూమి మాయం!

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు మాయం...రాత్రికి రాత్రే షెడ్లు, నిర్మాణాలు

కాళేశ్వరంలో యథేచ్ఛగా రెవెన్యూ స్థలం కబ్జా..

నిమ్మకు నీరెత్తిన అధికారులు

నోటీసులతో పంచాయతీ సరి.. పోలీస్ స్టేషన్‌లో 'సెటిల్మెంట్'


పంచాయతీలేంటి?

'నాకు తెల్వదు' అంటూ తహసీల్దార్ విచిత్ర స్పందన.. తెరవెనుక నడుస్తున్న కథేంటి?

**అక్షరదర్బార్, నిఘావిభాగం**

చట్టాన్ని చుట్టేస్తూ.. అధికారుల కళ్లు గప్పుతూ రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని బడా బాబులు కబ్జా చేశారు. తానే స్వయంగా సర్వే చేసి, "ఇది ప్రభుత్వ ఆస్తి.. ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు" అని రెవెన్యూ శాఖ పాతిన అధికారిక హెచ్చరిక బోర్డునే రాత్రికి రాత్రే మాయం చేశారు. బోర్డు పోవడమే ఆలస్యం.. అక్కడ తాత్కాలిక షెడ్లు, ఫెన్సింగ్‌లు, పక్కా నిర్మాణాలు శరవేగంగా వెలిసిపోయాయి. ప్రభుత్వ ఆస్తులను కంటికి రెప్పలా కాపాడాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు అంతా జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం కాళేశ్వరం ప్రాంతంలో తీవ్ర సంచలనంగా మారింది. లంచాల మత్తులో కొందరు, రాజకీయ ఒత్తిళ్లతో మరికొందరు అధికారులు కబ్జాదారులకు ముందస్తు సహకారం అందించారనే విమర్శలు క్షేత్రస్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి.

3



## కేయూని రాజకీయ వేదికగా మార్చొద్దు

- అభివృద్ధికి సహకరించండి.. అడ్డుకుంటే చూస్తూ ఊరుకోం
- విద్యార్థులను రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలనుకోవడం దురదృష్టకరం
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై బీఆర్ఎస్, బీజేపీలది ద్వంద్వ వైఖరి
- మామునూరు ఎయిర్‌పోర్ట్‌పై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

2

## దేవాదాయ శాఖలో నూతన శకం

2

191 మందికి నియామక ఉత్తర్వులు

చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో భారీ నియామకాలు

నియామక పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ

అక్షర దర్బార్



## మార్కెటింగ్ డైరెక్టర్ ను కలిసిన బొమ్మినేని

- కాటన్ జిన్నింగ్ పరిశ్రమలు, వరంగల్ మార్కెట్ సమస్యలపై వినతి
- సమస్యల పరిష్కారానికి డైరెక్టర్ సానుకూల స్పందన

అక్షరదర్బార్, వరంగల్: మార్కెటింగ్ శాఖ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది, పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టిన ఆర్ లక్ష్మణుడిని తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, కక్కిరాల రమేష్ లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మార్కెటింగ్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో, వారు నూతన డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

– పరిశ్రమలు, మార్కెట్ సమస్యలపై చర్చ

ఈ సమావేశం సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాటన్ జిన్నింగ్ పారిశ్రామిక వర్గాలు ఎదుర్కొంటున్న వివిధ రకాల సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వీటితో పాటు వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, వ్యాపారులు, రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను కూలంకషంగా వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమల మనుగడ సాగాలన్నా, మార్కెట్ లావాదేవీలు సజావుగా సాగాలన్నా ఈ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరం ఉందని వారు కోరారు.

### డైరెక్టర్ హామీ

వరంగల్ చాంబర్ ప్రతినిధులు వివరించిన సమస్యలపై మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఆర్ లక్ష్మణుడు సానుకూలంగా స్పందించారు. కాటన్ జిన్నింగ్ పరిశ్రమల సమస్యల పరిష్కారానికి, వరంగల్ మార్కెట్ పురోగతికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# కేయూని రాజకీయ వేదికగా మార్చొద్దు

- అభివృద్ధికి సహకరించండి.. అడ్డుకుంటే చూస్తూ ఊరుకోం
- విద్యార్థులను రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలనుకోవడం దురదృష్టకరం
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుపై బీఆర్ఎస్, బీజేపీలది ద్వంద్వ వైఖరి
- మామునూరు ఎయిర్‌పోర్ట్‌పై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



అక్షరదర్బార్, హనుమకొండ: కాకతీయ యూనివర్సిటీని రాజకీయాలకు అడ్డాగా మార్చకుండా, విద్యార్థుల భవిష్యత్తు కోసం అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రెచ్చగొట్టి యూనివర్సిటీ అభివృద్ధిని అడ్డుకునే కుట్ర చేస్తున్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు.

శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలో పర్యటించిన ఎమ్మెల్యే నాయిని.. జాయింట్ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన పుల్ల శ్రీనివాస్ ను, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ పెద్దమల్ల శ్రీనివాస్ గార్లను ప్రత్యేకంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

– ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై మాత్రమే ఎందుకు వ్యతిరేకత..?

యూనివర్సిటీలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటును కొందరు కావాలనే వివాదాస్పదం చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ అనుబంధ విద్యార్థి సంఘాలు తమ రాజకీయ అజెండాతోనే పాఠశాల తరలింపును అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. "గతంలో యూనివర్సిటీలో సబ్‌స్టేషన్‌కు, బ్యాంకుకు, పోలీస్ స్టేషన్‌కు, ఇతర ప్రభుత్వ శాఖలకు స్థలాలు కేటాయించినప్పుడు నోరు మెదపని ఈ సంఘాలు.. ఇప్పుడు యూనివర్సిటీకే ఉపయోగపడే ఇంటిగ్రేటెడ్ స్కూల్ విషయంలో ఎందుకు రచ్చ చేస్తున్నాయి? ఈ ద్వంద్వ వైఖరి వెనుక ఉన్న రాజకీయం ఏంటి?" అని ఎమ్మెల్యే నిలదీశారు. ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఈసీ) ఆమోదం పొందిన తర్వాత కూడా అభివృద్ధి పనులను అడ్డుకోవడం వెనుక స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మెస్ అక్రమాలపై కమిటీ వేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని, వీటన్నింటి వెనుక వైస్ ఛాన్సలర్ నిర్లక్ష్యం కూడా ఉందని విమర్శించారు. బోధన, బోధనేతర సిబ్బంది రెగ్యులరైజేషన్ వంటి కీలక అంశాలు కూడా ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న అధికారులను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

### మామునూరు విమానాశ్రయంపై బీఆర్ఎస్‌కు మాట్లాడే హక్కు లేదు

మామునూరు విమానాశ్రయం విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారం పూర్తిగా ప్రజలను మోసం చేయడమేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొట్టిపారేశారు. పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క అడుగు కూడా ముందుకు వేయని వారు... ఇప్పుడు విమానాశ్రయంపై క్రెడిట్ కోసం మాట్లాడటం రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమన్నారు. రూ.350 కోట్లకు పైగా జీఎంఆర్‌కు చెల్లింపులు చేసినా గత ప్రభుత్వం ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేకపోయిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్రంతో చర్చించి విమానాశ్రయ ఏర్పాటుకు స్పష్టమైన పురోగతి సాధించారని స్పష్టం చేశారు.

### రాజకీయ స్వార్థం కోసం వర్సిటీని నాశనం చేస్తే చూస్తూ ఊరుకోను

"నేను తప్పు చేసి ఉంటే చట్టం ప్రకారం చర్యలు తీసుకోండి. కానీ బ్రోకర్లు, మధ్యవర్తులు, రాజకీయ స్వార్థం కోసం యూనివర్సిటీని నాశనం చేసే ప్రయత్నం చేస్తే మాత్రం చూస్తూ ఊరుకోను. అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రజల తరఫున నేనే పోరాటం చేస్తా" అని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ తరహాలోనే కేయూకి కూడా ప్రత్యేక ప్రజాప్రతినిధుల కమిటీలు, పర్యవేక్షణ వ్యవస్థలు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

# దేవాదాయ శాఖలో నూతన శకం

- 191 మందికి నియామక ఉత్తర్వులు
- చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో భారీ నియామకాలు
- నియామక పత్రాలు అందజేసిన మంత్రి కొండా సురేఖ



అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. 70 ఏళ్ళ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ – ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగని రీతిలో దేవాదాయ శాఖలో ఒకేసారి 191 మంది మతపరమైన ఉద్యోగుల నియామకం చేపట్టారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వేదికగా జరిగిన ఘనమైన కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని, నూతన ఉద్యోగులకు స్వయంగా నియామక ఉత్తర్వులను అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాలకు ఎంపికైన పురోహితులు, పరిచారకులు, వేదపండితులు, అసిస్టెంట్ కుక్ లు, డోలు, సన్నాయి, మృదంగం, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన ఉద్యోగులు ఈ నియామక పత్రాలను అందుకున్నారు.

### భగవంతుని సేవ చేసే పవిత్ర బాధ్యత

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని కొనియాడారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, వాయిద్య కళాకారులు, వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని పేర్కొన్నారు. ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదని, దేవాలయ సేవ అనేది కేవలం ఉపాధి లేదా ఉద్యోగమో కాదని, అది భగవంతుని సేవ చేసే పవిత్ర బాధ్యతని మంత్రి స్పష్టం చేశారు. 'భక్తసేవే భగవత్సేవ' అనే భావనతో భక్తులకు మరింత నాణ్యమైన సేవలు అందించడమే నూతన ఉద్యోగుల లక్ష్యం కావాలని ఆమె పిలుపునిచ్చారు.

### అర్చకులు, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పనితీరుకు, పారదర్శకతకు ఈ చారిత్రాత్మక నియామకాలే నిదర్శనమని మంత్రి సురేఖ అన్నారు. దేవాదాయ శాఖ అధికారుల సమిష్టి కృషి ఫలితంగానే ఈ ప్రక్రియ విజయవంతమైందని, తన హయాంలో ఇలాంటి గొప్ప కార్యక్రమం జరగడం దైవానుగ్రహంగా భావిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం దేవుని సేవలో తరించే ఉద్యోగుల కోసం 'అర్చకులు ఇతర ఉద్యోగుల సంక్షేమ నిధి ట్రస్ట్' ద్వారా ప్రయోజనాలను భారీగా పెంచి అందిస్తున్నామని వెల్లడించారు. భవిష్యత్తులో ఉద్యోగుల పనితీరు ఆధారంగా దేవాలయాల అన్ని విభాగాల సిబ్బందికి ప్రత్యేక అవార్డులు ప్రదానం చేస్తామని ప్రకటించారు.



# డెడ్ లైన్ జూలై 31

- రేషన్ కార్డు ఈ-కేవైసీకి ఆఖరు గడువు
- లక్ష్యం చేరుకోని డీలర్లపై కఠిన చర్యలు తప్పవు
- జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి ఆదేశం

అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యునికి ఈ నెల 31 లోపు ఈ–కేవైసీ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల ఫెయిర్ ప్రైస్ షాప్ (ఎఫ్ పీఎస్) డీలర్ల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఈ–కేవైసీ పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో అర్హులైన ప్రతి రేషన్ కార్డు సభ్యుడికి ఈ–కేవైసీ పూర్తి చేయడాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించే డీలర్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### డీలర్లకు కీలక ఆదేశాలు జారీ

ఈనెల 31లోపు రేషన్ కార్డులోని ప్రతి ఒక్క సభ్యుడికి తప్పనిసరిగా ఈ–కేవైసీ పూర్తి చేయాలి. ప్రతిరోజూ నిర్వహించిన ఈ–కేవైసీ వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తప్పనిసరిగా నమోదు చేయాలి. ఇంకా ఈ–కేవైసీ చేయించుకోని లబ్ధిదారులను వ్యక్తిగతంగా సంప్రదించి, వారు సమీపంలోని ఫెయిర్ ప్రైస్ షాప్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలి. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బయటకు రాలేని లబ్ధిదారుల కోసం డీలర్లే స్వయంగా వారి ఇళ్లకు వెళ్లి ప్రత్యేకంగా ఈ–కేవైసీ నిర్వహించాలి. నిర్ణీత గడువులోగా వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయని డీలర్లపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు.

### ఈ-కేవైసీ చేయించుకోకపోతే రేషన్ కట్

రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి సభ్యుడు తమ వేలిముద్ర (బయోమెట్రిక్) ద్వారా సమీపంలోని ఫెయిర్ ప్రైస్ షాప్ (ఎఫ్ పీఎస్) లో ఈనెల 31 లోపు తప్పనిసరిగా ఈ–కేవైసీ పూర్తి చేయించుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. గడువులోపు ఈ–కేవైసీ పూర్తి చేయని సభ్యులకు భవిష్యత్తులో రేషన్ సరుకుల పంపిణీ నిలిచిపోయే లేదా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ–కేవైసీ ప్రక్రియలో సాంకేతిక సమస్యలు లేదా ఏవైనా ఇతర ఇబ్బందులు ఎదురైతే, లబ్ధిదారులు వెంటనే సంబంధిత మండల పౌర సరఫరాల అధికారిని (ఆర్ఐ/ఏఎస్వో) లేదా సమీప ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్‌ను సంప్రదించాలని సూచించారు.

# కోట్ల విలువైన ప్రభుత్వ భూమి మాయం!



## ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు మాయం...రాత్రికి రాత్రే షెడ్లు, నిర్మాణాలు

- కాళేశ్వరంలో యథేచ్ఛగా రెవెన్యూ స్థలం కబ్జా.. నిమ్మకు నీరెత్తిన అధికారులు
- నోటీసులతో పంచాయతీ సరి.. పోలీస్ స్టేషన్‌లో 'సెటిల్మెంట్' పంచాయతీలేంటి?
- 'నాకు తెల్వదు' అంటూ తహసీల్దార్ విచిత్ర స్పందన.. తెరవెనుక నడుస్తున్న కథేంటి?

**అక్షరదర్బార్, నిఘావిభాగం**

చట్టాన్ని చుట్టేస్తూ.. అధికారుల కళ్లు గప్పుతూ రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని బడా బాబులు కబ్జా చేశారు. తానే స్వయంగా సర్వే చేసి, "ఇది ప్రభుత్వ ఆస్తి.. ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు" అని రెవెన్యూ శాఖ పాతిన అధికారిక హెచ్చరిక బోర్డునే రాత్రికి రాత్రే మాయం చేశారు. బోర్డు పోవడమే ఆలస్యం.. అక్కడ తాత్కాలిక షెడ్లు, ఫెన్సింగ్‌లు, పక్కా నిర్మాణాలు శరవేగంగా వెలిసిపోయాయి. ప్రభుత్వ ఆస్తులను కంటికి రెప్పలా కాపాడాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు అంతా జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం కాళేశ్వరం ప్రాంతంలో తీవ్ర సంచలనంగా మారింది. లంచాల మత్తులో కొందరు, రాజకీయ ఒత్తిళ్లతో మరికొందరు అధికారులు కబ్జాదారులకు ముందస్తు సహకారం అందించారనే విమర్శలు క్షేత్రస్థాయిలో బలంగా వినిపిస్తున్నాయి.

ప్రభుత్వమే అధికారికంగా సర్వే చేసి, ఇది ప్రభుత్వ రెవెన్యూ భూమి అని బోర్డు పాతిన స్థలంలోనే ఇప్పుడు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు, కబ్జాలు కొనసాగుతుండటం కాళేశ్వరం ప్రాంతంలో సంచలనంగా మారింది. రూ.కోట్ల విలువైన ఈ భూమిపై కొందరు స్థానిక బడా బాబులు కన్నేసి, చట్టాన్ని చుట్టేస్తూ రాత్రికి రాత్రే షెడ్లు, ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయడం స్థానికంగా కలకలం రేపుతోంది. ప్రభుత్వ ఆస్తులను కంటికి రెప్పలా కాపాడాల్సిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు అంతా జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

### 2021లో బోర్డు... 2026 నాటికి మాయం!

ఈ వివాదాస్పద భూమికి సంబంధించిన గత చరిత్రను పరిశీలిస్తే 2021 నవంబర్‌లో అప్పటి మహాదేవపూర్ తహసీల్దార్ క్షేత్రస్థాయి పర్యటన చేసి, ఈ భూమి పూర్తిగా తెలంగాణ ప్రభుత్వానికి చెందిన రెవెన్యూ భూమి అని నిర్ధారించారు. ఈ భూమి ప్రభుత్వానిది.. ఇందులో ఎలాంటి ఆక్రమణలు, క్రయవిక్రయాలు, నిర్మాణాలు చేయరాదు. అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అని స్పష్టంగా రాసి ఉన్న ఒక పెద్ద హెచ్చరిక బోర్డును కూడా అక్కడ ఏర్పాటు చేయించారు. కానీ కాలక్రమేణా, ఆక్రమణదారుల కన్ను ఈ కోట్ల విలువైన భూమిపై పడింది. పక్కా ప్లాన్ ప్రకారం ఆ ప్రభుత్వ హెచ్చరిక బోర్డును రాత్రికి రాత్రే మాయం చేసేశారు. బోర్డు మాయమవ్వడమే ఆలస్యం.. అదే స్థలంలో ఇప్పుడు తాత్కాలిక షెడ్లు, చుట్టూ ఫెన్సింగ్‌లు, శాశ్వత పక్కా నిర్మాణాలు శరవేగంగా వెలిసిపోవడం వెనుక స్థానిక అధికారుల ముందస్తు సహకారం ఉందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి.

### ఫిర్యాదుతో కదిలిన పంచాయతీ అధికారులు..కానీ?

ప్రభుత్వ భూమిలో అక్రమంగా జరుగుతున్న ఈ కబ్జాల పర్వంపై ఎమ్మార్పీఎస్ మహాదేవపూర్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ రంగంలోకి దిగారు. బాధ్యతగల పౌరుడిగా ఆయన సంబంధిత రెవెన్యూ, పంచాయతీ అధికారులకు లిఖితపూర్వకంగా, తగిన ఆధారాలతో ఫిర్యాదు చేశారు. కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని, ఆక్రమణలను వెంటనే జేసీబీలతో కూల్చివేసి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదుతో వేడి పుట్టడంతో, పంచాయతీ అధికారులు ఎట్టకేలకు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చట్టప్రకారం ఆక్రమణలను కూల్చేయాల్సింది పోయి.. కేవలం కంటితుడుపు చర్యగా నిర్మాణాలు చేపట్టిన వారికి ప్రాథమిక నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నట్లు సమాచారం అందుతోంది.

### పోలీస్ స్టేషన్‌లో సెటిల్మెంట్ పంచాయతీ ఎందుకు..?

ఈ ఆక్రమణల వ్యవహారం కాస్తా ముదరడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఈ వివాదం కాళేశ్వరం పోలీస్ స్టేషన్‌కు చేరింది. అయితే, ఇక్కడే అసలు ట్విస్ట్, తెరవెనుక రాజకీయాలు వెలుగులోకి వచ్చాయి. ఒక ప్రభుత్వ భూమికి సంబంధించిన వివాదం వచ్చినప్పుడు, దానిపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది, చట్టపరమైన చర్యలు చేపట్టాల్సింది రెవెన్యూ తహసీల్దార్ లేదా పంచాయతీ అధికారులు. కానీ, దీనికి పూర్తి భిన్నంగా ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి అక్కడ ఒక రకమైన సెటిల్మెంట్ పంచాయతీ నిర్వహించడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ ఆస్తిని కబ్జా పెడుతుంటే కేసు పెట్టాల్సిన పోలీసులు, అక్కడ రాజీ ప్రయత్నాలు చేయడానికి గల కారణాలు ఏమిటి? ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గి ఈ పంచాయతీ చేశారనే ప్రశ్నలు ఇప్పుడు కాళేశ్వరంలో గుప్పుమంటున్నాయి.

### జిల్లా ఉన్నతాధికారులు స్పందిస్తారా..?

ఒకవైపు పక్కా ఆధారాలు ఉన్న ప్రభుత్వ హెచ్చరిక బోర్డు మాయం కావడం, మరోవైపు యథేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణాలు, పోలీస్ స్టేషన్‌లో సాగిన వివాదాస్పద రాజీ ప్రయత్నాలు, తహసీల్దార్ నాకు తెలియదు అనే సమాధానాలు వెరసి ఈ వ్యవహారం నియోజకవర్గంలోనే హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నత స్థాయి రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి నిష్పాక్షికమైన సమగ్ర విచారణ జరిపించాలని, కబ్జాకు గురవుతున్న రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం

**బెల్లంపల్లి సురేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు**

ప్రభుత్వ భూములను సంరక్షించి, ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రాథమిక బాధ్యతను అధికారులు విస్మరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ తీవ్రంగా మండిపడ్డారు. అధికారులు ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి వెంటనే ఆక్రమణలను తొలగించి, ప్రభుత్వ భూమి చుట్టూ రక్షణ గోడ కట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక అధికారులు స్పందించని పక్షంలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులను కలుస్తామని, అవసరమైతే హైకోర్టును ఆశ్రయించి ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసి న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.



### నా దృష్టికి రాలేదు.. నాకు తెలియదు

**తహసీల్దార్ విచిత్ర స్పందన**

ఈ మొత్తం వ్యవహారంపై మహాదేవపూర్ ప్రస్తుత తహసీల్దార్ సత్యనారాయణ స్వామిని వివరణ కోరగా, ఆయన ఇచ్చిన సమాధానం మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. నేను ఇక్కడ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇప్పటివరకు కాళేశ్వరంలో ప్రభుత్వ రెవెన్యూ భూమి ఆక్రమణకు గురవుతున్నట్లు కానీ, అక్కడ నిర్మాణాలు జరుగుతున్నట్లు కానీ నా దృష్టికి రాలేదు. గతంలో 2021లో అక్కడ ప్రభుత్వ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన విషయం కూడా నాకు తెలియదు. దీనిపై విలేజ్ రెవెన్యూ అధికారులు లేదా కింది స్థాయి సిబ్బంది నాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. ఇప్పుడు ఈ విషయం నా దృష్టికి వచ్చింది కాబట్టి, పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, ఒకవేళ అది ప్రభుత్వ భూమి అని తేలితే ఆక్రమణదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు. కోట్ల విలువైన భూమిపై బోర్డు మాయమైతే కింది స్థాయి సిబ్బంది ఉన్నతాధికారికి సమాచారం ఇవ్వకపోవడం వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉందనే అనుమానాలకు ఈ సమాధానం బలాన్ని చేకూరుస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# రైతుల అరిగోస

- వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం
- వర్షా భావ పరిస్థితుల్లో కొరవడిన ముందుచూపు
- 'దేవాదుల' పంపింగ్ లో దారుణ వైఫల్యం
- 'అక్షరదర్బార్'తో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

అక్షరదర్బార్, హనుమకొండ : వ్యవసాయరంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం కనబరుస్తుంది. ప్రస్తుతం వర్షాబావ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడంలో విఫలమైంది. ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఖరీఫ్ సీజన్ కు ముందు నుంచే చెబుతున్నప్పటికీ ప్రాజెక్టుల ద్వారా సాగునీటిని అందుబాటులోకి తేలేకపోయింది. వ్యవసాయానికి విద్యుత్తును కూడా 24 గంటలు ఇవ్వడం లేదు. రోజుకి కేవలం 13 గంటలు మాత్రమే ఇస్తుంది. అనధికార కోతలతో అది కూడా సరిగా సప్లై కావడం లేదు. ఇదిలా ఉంటే యూరియా, డీఏపీ కొరత రైతులను వెంటాడుతుంది. ఇక ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని చెబుతుందే గాని ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని బీఆర్ఎస్ నేత, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ప్రభుత్వానికి ముందుచూపు కొరబడిందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధానంగా వ్యవసాయ శాఖ వైఫల్యం స్పష్టంగా కనబడుతుందని మండిపడ్డారు. ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో శుక్రవారం వెంకటరమణారెడ్డి 'అక్షరదర్బార్'తో మాట్లాడారు. ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఏమన్నారంటే ఆయన మాటల్లో...

### ప్రణాళిక లేదు.. సమీక్షలు లేవు



ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని మూడు నాలుగు నెలల నుంచి వాతావరణ శాఖ చెబుతుంది. అప్రమత్తమై వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రణాళికను రూపొందించి ముందుకు వెళ్లాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని చెబుతుందే గాని ఏ పంటలు సాగు చేయాలి, మొక్కజొన్న, జొన్న, ఆముదం వంటివి సాగు చేయాలా?, వీటిలో ఏ పంట కాలపరిమితి ఎంత?, సీడ్ అందుబాటులో ఉందా?, మార్కెట్ పరిస్థితి ఏమిటి? అనే అంశాలపై రైతులకు కనీసం అవగాహన కల్పించడం లేదు. రైతాంగానికి అండగా నిలిచేందుకు తాజా పరిస్థితులపై వ్యవసాయ శాఖ మంత్రి, అధికారులు గాని సమీక్షలు చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అత్యవసర సమావేశాలు నిర్వహించి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి.

### కొరవడిన ముందుచూపు

సాగునీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు ఇవ్వడంలో ప్రభుత్వానికి ముందు చూపు కొరవడింది. ఉదాహరణకు ఉమ్మడి వరంగల్ జిల్లా రైతాంగానికి 'దేవాదుల' ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల ద్వారా పంపింగ్ చేయడానికి గోదావరిలో నీరు ఉంది. జూన్ 1 నుంచి పంపింగ్ మొదలైతే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లలోకి నీరు చేరేది. ఆలస్యంగా.. కొద్దిరోజుల క్రితం పంపింగ్ ప్రారంభించడం, అది కూడా పూర్తిస్థాయిలో పంపింగ్ జరగకపోతుండటం వల్ల దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని ఏ రిజర్వాయర్ లోకి ఇప్పటివరకు నీరు చేరలేదు. సాంకేతిక కారణాలు, విద్యుత్ కొరత, మోటార్ల రిపేర్ వల్ల దేవాదుల ప్రాజెక్టు ద్వారా పూర్తిస్థాయిలో పంపింగ్ జరగటం లేదు. ఇది ప్రభుత్వ వైఫల్యమని చెప్పవచ్చు. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయం కోసం వాడుకుంటున్నారు. దేవాదులను పూర్తిస్థాయిలో నడిపిస్తే ఉమ్మడి వరంగల్ కు సాగు, తాగునీటి కొరత ఉండదు. కొంత ఎస్సారెస్పీ ఆయకట్టుకు సైతం నీరందుతుంది.

### కరెంటు సరఫరా 13 గంటలే

వ్యవసాయానికి 24 గంటల కరెంటు అనేది కాంగ్రెస్ పేటెంట్ అని ఆ పార్టీ నేతలు చెప్తున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితిని చూస్తే పాత రోజులు గుర్తొస్తున్నాయి. ఇప్పుడు వ్యవసాయానికి రోజుకి 13 గంటల విద్యుత్ సరఫరా మాత్రమే జరుగుతుంది. తెల్లవారుజామున 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా అవుతుంది. ఈ 13 గంటల్లో కూడా మధ్య మధ్యలో అనధికార కరెంటు కోత ఉంటుంది. తెల్లవారుజామున 3 గంటల నుంచి కరెంటు ఇస్తుండటం వల్ల రైతులు ముందుగానే అంటే.. రెండున్నర గంటలకు నిద్ర లేచి రాత్రివేళ చీకట్లో టార్చ్ లైట్ వెలుతురులో మోటార్లను ఆన్ చేసేందుకు వ్యవసాయ బావి, బోర్ వద్దకు వెళ్తున్న పరిస్థితి కొనసాగుతుంది. కేసీఆర్ చెప్పిందే జరుగుతుంది. ఏదేమైనా వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇవ్వాల్సిందే.

### వ్యవసాయ శాఖ వైఫల్యం

వ్యవసాయ శాఖ వైఫల్యం స్పష్టంగా కనబడుతుంది. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఒకవైపు సాగునీటి కొరత తలెత్తగా, మరోవైపు వ్యవసాయానికి విద్యుత్ కేవలం 13 గంటలు మాత్రమే సరఫరా అవుతుండటం, ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం కొరవడగా, ఇంకోవైపు యూరియా, డీఏపీ కొరత తీవ్రంగా ఉంది. యూరియా, డీఏపీ అందుబాటులో లేవు. వీటి కోసం రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఒక ఆధార్ కార్డుకు ఒక డీఏపీ బస్తా మాత్రమే ఇస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఇవేవీ పట్టించుకోవడం లేదు.

### డ్రిప్ కంపెనీలకు పేమెంట్స్ లేవు

రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ప్రభుత్వం అంటుంది. కానీ అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం లేదు. ఉదాహరణకు ప్రత్యామ్నాయ పంటల్లో ఫామ్ ఆయిల్ ఒకటి. దీన్ని సాగు చేసే రైతులకు డ్రిప్ అవసరం. అయితే ఈ డ్రిప్ పరికరాలు, పైపులను సరఫరా చేసే కంపెనీలకు ప్రభుత్వం సమయానికి చెల్లింపులు జరపటం లేదు. దీంతో ఫామ్ ఆయిల్ సాగు చేసే రైతులు డ్రిప్ కోసం తమ వాటాదనాన్ని డీడీ ద్వారా అందజేసి నెలల తరబడి డ్రిప్ పరికరాలు, పైపుల కోసం వేచి చూడాల్సి వస్తుంది. సబ్సిడీ కింద ప్రభుత్వం నుంచి రావాల్సిన అమౌంట్ డ్రిప్ కంపెనీలకు అందటంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. దీంతో ఫామ్ ఆయిల్ సాగు చేసే రైతులు తమ వాటా దనాన్ని చెల్లించిన తర్వాత మూడు నాలుగు నెలల వరకు డ్రిప్ పరికరాలు, పైపుల కోసం వేచి చూడాల్సి వస్తుంది. ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని చెప్తున్న ప్రభుత్వం ఫామ్ ఆయిల్ రైతులకు డీడీ ఇచ్చిన వెంటనే డ్రిప్ సమకూర్చాలి.